# వాళ్ళు మా పార్టీ కాదు

"మేము బంద్ చేయాలనుకుంటున్నాము సార్!"

"ఎందుకు?"

"తాలూకాలో కరువు తీవ్రత గురించీ, రైతు యిక్కట్ల గురించీ ప్రభుత్వానికి తెలిపేందుకు"

"మంచి నిర్ణయం." చెప్పాను.

"మన తాలూకా పరిస్థితి చాలా అధ్వాన్నంగా ఉంది సార్! స్థానిక మంత్రులుగాని, జిల్లాల ఇన్‌చార్జి మంత్రి గాని, చివరకు యీ నియోజకవర్గ ప్రజా ప్రతినిధిగాని యీ ప్రాంతాన్ని పట్టించుకోవట్లేదు. జిల్లాలో అన్ని తాలూకాలనూ సందర్శించి నివేదికలు రాసుకొన్న కరువు పరిశీలక బృందం యీ తాలూకాకేసి కన్నెత్తి కూడ చూడలేదు. అందుకే మేం బంద్ జరపాలనుకొన్నాం." ఉద్వేగంగా చెప్పాడు ప్రభాకర్. కేంద్రంలో బలంగా ఉండి, రాష్ట్రంలో నామమాత్రంగా ఉన్న ఒకానొక రాజకీయ పార్టీకి తాలూకా లీడర్ అతను. నాకు మిత్రుడు.

"మంచి సమస్యల మీద స్పందిస్తున్నారు. పోరాటం సమర్థవంతంగా వుండాలి. ఇంతకీ ఎప్పుడు?" అడిగాను.

"అందరం చర్చించి ఎప్పుడైందీ సాయంత్రం నిర్ణయించుకొంటాం" చెప్పాడు.

నాకు సంతోషంగా వుంది - రైతుల్ని గురించి ఆలోచిస్తున్నందుకు. ప్రతి రాజకీయనాయకుడు రాబోయే ఎన్నికలను గురించి ఆలోచిస్తున్నాడు తప్ప పశుగ్రాసం లేక, పశువుల్ని మందలు మందలుగా సంతకు తోలుకుపోతున్న విషయం గమనించట్లేదు. ఎటు చూసినా ఎండి మాడిపోయిన పైరు - పెట్టుబడి ఉరితాళ్ళను రైతుకోసం సిద్ధం చేసిన దృశ్యాల్ని జీపుల్లో వెళ్ళేటపుడయినా చూసి మెదడులో ముద్రించుకోవట్లేదు. బోరుబావులు గొంతు పట్టుకున్న వాటిలా ఒక నిమిషం నీళ్ళు చిమ్మి, రెండు నిమిషాల పాటు మౌనం వహించి మూడో నిమిషం మళ్ళీ నీళ్ళు చిందేందుకు ప్రయత్నించటం పరిశీలించట్లేదు.

ఎవడి స్వార్థం వాడిది.

వాళ్ళకు అప్పుడప్పుడు చురకలు తగలకుండా వుంటే లాభం లేదు.

ప్రభాకర్ కేసి ఆత్మీయంగా చూస్తూ అతనివద్ద శెలవుతీసికొని బస్టాండ్ కెళ్ళాను.

కంట్రోలర్‌ని అడిగితే, కడపబస్సు పదినిమిషాల క్రితమే వెళ్ళిందన్నాడు.

ఉసూరుమంటూ బైటకొచ్చాను.

నా అదృష్టం కొద్దీ ప్రైవేటు బస్సొకటి బస్టాండుబైటే కాచుకొని ఉంది. హార్న్ గొంతెత్తి ప్రయాణీకుల్ని పిలుస్తూ ఉంది.

బస్సు డోర్ వద్ద ఎవరో పెద్దాయన తెగ అవస్థపడుతున్నాడు. ఆయాసపడుతున్నాడు. చెమట్లు కక్కుతున్నాడు. ఇంత చేసినా బస్తాను బస్సులోకి చేర్చలేకున్నాడు.

ఎవరూ సహాయం చేయట్లేదు పాపం. పైపెచ్చు ఎదురుగా ఉన్న హమాలీ ఒకడు నవ్వుతున్నాడు.

ఆయన ఇంకా తంటాలు పడుతూనే ఉన్నాడు.

"బొడ్లోంచి లెక్కదీ రెడ్డీ! మూటె బస్సులో నేనేస్తగాని..." నవ్వుతూ ముందుకొచ్చాడు హమాలీ.

"వొద్దులే...యీ మూటె బస్సులో వేసినందుకు నీకు రొండ్రూపాయలు ఎవుడిస్తాడు? వొద్దు... తగలగాకు" అరిచాడు ఆయన.

నాకు విషయం అర్థమైంది.

హమాలి అత్యాశమీద కోపం కూడా వచ్చింది. వెళ్ళి పెద్దాయనకు సాయంపట్టాను. బస్తాను బస్సులోకి చేర్చాము.

"వొగిసిలో యిట్లాంటి మూటెలు రొంటిని ఒక్కసారే ఎత్తుకొనేవాన్ని. ఇప్పుడు సత్తా తగ్గింది" తన అశక్తత మీద తానే జాలి పడుతున్నట్లుగా అన్నాడు ముసలాయన.

హార్న్ కొడుతూ మరో పదినిమిషాలు నిల్చునేసరికి సీట్లకుమించి ఎక్కారు జనం.

బస్సు నెమ్మదిగా కదిలింది. ఊరుదాటేదాకా జనాల్ని పిలుస్తూనే ఉంది. పెళ్ళి నడక నడుస్తూ తలుపులు తెరుస్తూనే ఉంది. నెలదప్పి నవమాసాలు నిండేదాకా వూరొదిలేట్టు లేదు.

బస్సంతా గొడవ గొడవగా ఉంది. ప్రయాణీకుల అగచాట్లు చెప్పటానికి సాధ్యం కాకుండా వుంది.

ఊరుదాటింది బస్సు.

పల్లెపల్లెకాడ ఆగి జనాల్ని ఇంకా తనలో కూరుకొంటోంది.

ఏదైనా అడ్డొచ్చినపుడు డ్రైవర్ బ్రేక్‌వేస్తే చాలు ఆడామగా అంతా పిసికి కుప్పబోసినట్లుగా అవుతున్నారు.

ఇంత రద్దీలోసైతం ప్రయాణీకుల నోళ్ళు మూతలు పడటం లేదు. ఎన్నెన్ని రకాల లోకాభిరామాయణాలో పురులు విప్పుకొంటున్నాయి.

"యీ కరువు పొయ్యేట్టు లేదు. మనం బతికేట్టు లేము." ఎవరో బాధపడుతున్నారు.

వెంటనే నా ముందు సీట్లోని పెద్దాయన గొంతు విప్పాడు.

"కరువు కరువంటాండ్రు. యాడుంది కరువు? ఏ బస్సూ పట్టడం లేదు. ఏ సినిమాలు పట్టడం లేదు. ఏ హోటెలూ పట్టడం లేదు. యాడుందెబ్బీ కరువు? కూలోని కాడికి బోతే ఆడోల్లు ముప్పై, మొగోల్లు నలుభైకి తక్కువ రామంటాండ్రు. గోడకింద పుల్లదుమ్ములో వూరకెన్నా కూకొనుంటరుగాని పదో, పాతిక్కో పనికొచ్చేట్టు లేరు."

"నిజమే...నిజమే..." వంత పాడుతున్నాడు పక్కనున్నతను.

"బంజర్లు పట్టాల్జేసుకొని ప్రతివోడూ వ్యవసాయంలోకి దిగేటోడే. నేనూ రైతునేనని మీసాలు మెలేసేటోడే. కోరుకుగుత్తకు బూముల్జేసేటోడు కనబడ్డం గగనమైంది." చెప్పుకు పోతున్నాడు ఆయన. పక్కనున్న మనిషి గంగిరెద్దులా తలూపుతున్నాడు. ఔనంటున్నాడు.

"నన్నడుగుతే – యీ కరువు వరసగా నాలగేండ్లు రావాలబ్బీ! బంజరు భూములోల్ల పులుసనగాల. అప్పుడు.. అప్పుడే కూలీనాలి దొరికేది. బస్సుల్లో సీట్లు దొరికేది. పెద్దా చిన్నా తేడా కనపొచ్చేది...నువ్వా సూస్పొండవు గదబ్బీ! ఏదో నాలాంటోడు తప్పితే ముతక సాక్కాలు తొడిగే నాధుడుండాడా? ఎవుడూ ఇస్త్రీ మడతల గుడ్డ లేసేటోడే. వాచీ బెట్టేటోడే.. మొండిగోడలగ్గాడా టేపురికార్డులు బిగించుకొనేటోడే. షాపుల్లో చెప్పులేసుకొనేటోడే... ఒకటి రొండు గాదు నాయనా! నాలుగేండ్లు కరువు రావాల" పెద్దాయన రెచ్చిపోతున్నాడు.

పల్లెవద్ద బస్సాగింది.

దిగినంత మంది ఎక్కారు.

తర్వాత స్టేజివద్ద పెద్దాయన లేచాడు దిగేందుకు. బస్తా దించేందుకు చేసాయమెవరైనా చేస్తారేమోనని అటుఇటు చూశాడు గాని నేను చూపుల్ని మరో వైపు వొంచుకున్నాను.

కింది నుంచి వాళ్ళ మనిషే కాబోలు వచ్చి బస్తా దించుకొన్నాడు.

బస్సు కదిలింది.

చాలాసేపు నా మనస్సును ఆయన మాటలే కలచివేస్తున్నాయి.

కిటికీలోంచి బైటకు చూస్తూ ఆలోచిస్తున్నాను.

సర్కారు తుమ్మచెట్లతో నిండి, గర్భమెండిన సగిలేటిని దాటింది బస్సు. కేశాపురం దాటింది. ముడమాల క్రాస్ వద్ద ఆగింది.

డ్రైవర్ బైటి వ్యక్తుల్తో ఏదో మాట్లాడుతున్నాడు. ప్రయాణీకులు కూడా కొందరు ముందుకెళ్ళి వాళ్ళ సంభాషణల్లో జోక్యం చేసికొంటున్నారు.

విచారిస్తే – అంగం పల్లె వద్ద రైతులు 'రాస్తారోకో' చేస్తున్నారని తెలిసింది. వాహనాలన్నిట్నీ ఆపేస్తున్నారట.

రైతుల్లో ఇలాంటి కదలిక వచ్చినందుకు నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది.

ఊర్లో చేతిపంపులకు నీళ్ళు అందటం లేదుట. పొలాల్లోని బోరుబావుల్లో నీళ్ళు తెచ్చుకొందామనుకొంటే వారం రోజుల్నించి కరెంటు లేదుట. తాగేందుకు నీటి చుక్కలేక విద్యుదధికార్ల నిర్లక్ష్య ధోరణికి నిరసనగా యీ చర్య తీసికొంటున్నారుట.

రైతుల్లో చలనం వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. మరో వైపు వాళ్ళ అవస్థలపట్ల ఆవేదనగా ఉంది.

"సిద్ధయ్య గారి మఠం మీదుగా బ్రహ్మంగారి మఠం పోయి, అన్నించి మల్లెపల్లెకాడ కడప రోడ్డెక్కుదామన్నా!" కండక్టర్ చెప్పాడు.

ఈ మాట డ్రైవర్‌కు కూడా నచ్చినట్లుంది. వెంటనే బస్సును సిద్ధయ్యగారి మఠం రోడ్డుకు తిప్పాడు.

మట్టిరోడ్డ మీద దుమ్ము రేపుకుంటూ వెళ్తోంది బస్సు.

సమస్య తీరినందుకు సంతోషంగా ఉన్నారు ప్రయాణీకులంతా.

సర్కారు తుమ్మకంప ధాటికి బెదరి కిటికీ గ్లాసుల గట్టిగా బిగించుకొన్నాను.

అన్ని పైర్లకు కరువున్నా యీ పచ్చదనానికి కరువులేదు.

మొదట శాపంగా అనుకొన్న యీ కంప చెట్లే ఇప్పుడు ఇక్కడి ప్రజలకు జీవనాధారమయ్యాయి. ఈ కఱ్ఱ కాల్చి బొగ్గులుగా మార్చటం మీదే చాలా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి.

ముదుమాల వచ్చింది.

మలుపు తిరగ్గానే గుంపుగా ఉన్న జనాన్ని చూసి బస్సాగింది.

ఇక్కడా రైతులు ఆందోళన చేస్తున్నారు.

రైతుల్లో వచ్చిన యీ పరిణామం పట్ల మనస్సులో సంతోషం కలుగుతోన్నా, భంగమవుతోన్న పనిని తల్చుకొని విచారంగా ఉంది. ఈ రోజు ఆకాశవాణి కేంద్రంలో నా కథానిక రికార్డింగ్ చేయాల్సి ఉంది. కథ కూడా కరువుమీదే.

టయానికి కడప ఎట్లా చేరాలో అర్థం కాకుండా ఉంది.

ప్రయాణికులు రైతుల్ని ప్రాధేయపడుతున్నారు. చాలా అర్జంటు పనులున్నా యంటున్నారు. ఈ ఒక్క బస్సునూ వదలమని అడుగుతున్నారు.

రైతులు ఒప్పుకోలేదు.

నేనూ బస్సుదిగి ఆ గుంపులో చేరాను.

నేను రైతునో, ప్రయాణీకున్నో నాకే అర్థం కాకుండా ఉంది.

రైతుల్లోంచి ఒక చదువుకున్న యువకుడు ముందుకొచ్చి ప్రయాణీకుల్ని అడుగుతున్నాడు. "మీరు కూడా మాకు మద్దతివ్వాలి సార్! మా అవస్థలు మీకు అర్థమవుతున్నాయి గదా! నీళ్ళు లేకుండా ఎన్రోజులని బతకాల్నో చెప్పండి. పైరెండి పోతాంది. కడుపు మండిపోతాంది. ఒకటి రెండు రోజుల్నించి కాదుసార్! వారం రోజుల్నించి కరెంటాఫీసు చుట్టూ కాల్లరిగిపొయ్యేలా తిరిగినా మమ్మల్ని లెక్కజెయ్యటం లేదు...మాకూ కోత విధించుకో మనండి... రోజూ ఏదొక సమయంలో నాలుగ్గంటలు సక్రమంగా వదలమనండి చాలు... దిగుడు బావులు ఎటూ లేవు. ఉన్న చేతిపంపులు కూడా ఎండిపోయాయి...ఏ చావు చావాలి సార్!... అందుకే మీరూ మాకు మద్దతివ్వాలి సార్! నైతిక మద్దతు...మోరల్ సపోర్ట్..."

వాళ్ళ అవస్థల పట్ల నా గుండెల్లో ఆవేదన సుడులు దిరిగింది.

"మీరు రాస్తారోకో చేయటం మాక్కూడా సంతోషంగా ఉంది తమ్ముడూ! పనుండటం వల్ల మిమ్మల్ని అడుగుతున్నాం" చెబుతున్నాడు ఒక ప్రయాణీకుడు.

"మా కోసం ఒక్కరోజు మీమీ పనుల్ని ఆపుకోండి".

"చాలా అర్జంట్ పనులు."

"మా దప్పిక కంటేనా?"

మరేం మాట్లాడలేదు ఆ ప్రయాణీకుడు, వెనక్కి తిరిగి బస్సెక్కాడు.

మెల్లిమెల్లిగా అందరం బస్సులో దూరాము.

"ఆందోళన ఎటూ కొనసాగుతున్నపుడు వెనక్కి తిరిగి మెయిన్ రోడ్‌లో వెయిట్ చేయటం మంచిది కదా!" చెప్పాను నేను.

డ్రైవర్‌కు నచ్చినట్లుంది.

బస్సు కదిలింది.

మెయిన్ రోడ్డెక్కి అంగం పల్లె వద్ద అన్ని బస్సులతో బాటు మా బస్సూ ఆగింది. గంటసేపు నిరీక్షించిన తర్వాత రాస్తారోకో సడలించబడింది. ఇప్పటికీ కరెంటు వదలకుంటే సాయంత్రం మళ్ళీ రెండుగంటల సేపు ఆందోళన చేయాలని రైతులు నిర్ణయించుకొన్నట్టుగా తెలిసింది.

మొత్తానికి ప్రయాణీకుల్ని పెద్దగా ఇబ్బందుల పాల్జేయలేదు.

కడప వెళ్ళాను.

కథానిక రికార్డింగ్ పూర్తయేసరికి మూడుగంటలైంది.

వెంటనే బస్సెక్కాను.

కళ్ళ ముందు అంగంపల్లె రైతుల ఆందోళన దృశ్యాలే కదలాడుతున్నాయి. ఆ ఆందోళన వెనక నీటికోసం వాళ్ళు పడే తపన మనస్సులో వేరుపురుగులై తొలుస్తోంది.

నైతిక మద్దతు కోరిన ఆ యువకుడు పదేపదే కళ్ళముందు మెదలుతున్నాడు.

'ఆ ప్రాంతాన్ని ఎప్పుడెప్పుడు చేరుకొందామా' అని ఆరాటంగా ఉంది.

'రాస్తారోకో' పరిణామమేమిటో తెలిసికోవాలి.

నాలుగున్నరకు అంగంపల్లె చేరింది బస్సు.

ఆశ్చర్యంగా ఉంది.

రోడ్డంతా కలియజూశాను రాస్తారోకో తాలూకు దృశ్యాలు కన్పిస్తాయేమోనని. 'ఆందోళనకు కేటాయించిన సమయం ఐపోవటం వల్ల వాళ్ళు వెళ్ళిపోయారేమో!' అనుకొన్నాను.

అంతలో నన్నో దృశ్యం ఆకర్షించింది.

మగాళ్ళు చాలామంది గుంపులుగా సైకిళ్ళమీద పొలాల దారిలో వెళ్తున్నారు. మూతులకు తాడుకట్టి సైకిల్ కారియర్ మీదుగా రెండు ప్లాస్టిక్ బిందెల్ని వేలాడేసుకెళ్తున్నారు.

ఊరికి మైలు దూరంలోని బోరు బావికేసి వాళ్ళ ప్రయాణం.

అదికాదు నన్నాకర్షించింది.

ఊరిపక్కనే ఓ బోరుబావి ఉంది. దాని చుట్టూ ఆడమగ గుమిగూడి నీళ్ళు పట్టుకుంటున్నారు.

ఇంత దగ్గరలో నీళ్ళుంచుకొని వాళ్లెందుకు పొలాలకేసి పరుగెత్తుతున్నారో నాకర్థం కాలేదు. ఆశ్చర్యంగా ఉంది. విడ్డూరంగా కూడా ఉంది. దాని కథేమిటో తెలిసికోకుంటే మనస్సు నిలిచేట్టు లేదు.

డ్రైవర్‌కు చెప్పాను. 'టీతాగి పోదాం ర'మ్మని.

బస్సాపి అతను కిందికి దిగాడు.

రోడ్డుపక్కనే ఉన్న పూరిపాకలోకి దూరుతూ అనుకొన్నాను. 'మొత్తానికి విద్యుత్ సిబ్బందిని రైతులు హడలెత్తించార'ని.

కొన్ని కొన్ని పనులు జరగాలంటే కరవకున్నా కనీసం బుసయినా కొట్టి బెదిరించాలి. తప్పదు.

టీ తాగుతూ కొట్టతన్ని అడిగాను. "ఇవి ఉప్పు నీళ్ళా?" అని పూరిదగ్గరున్న బోరు బావి చూపిస్తూ.

ఆశ్చర్యంగా నాకేసి చూసాడతను. "లేదు సార్! మంచినీళ్ళే" ... చెప్పాడు. "ఇంత తియ్యటి నీళ్ళు యీ చుట్టుపక్కల ఎక్కడా లేవు."

"మరెందుకు కొంతమంది సైకిళ్ళకు బిందెలు వేలాడేసుకొని పొలాలకాడికి పోతున్నారు?" అడిగాను.

అతను నాకేసి ఎగాదిగా చూశాడు. తర్వాత టీ తిరగ్గొడుతూ చెప్పాడు. "వాళ్ళీ బోరుకాడికి రారు. వచ్చినా రానియ్యం."

"ఎందుకని? వాల్లేమన్నా హరిజనులా?"

"అదేం లే. హరిజనులు కూడా ఇక్కడే నీళ్లు పట్టుకొంటారు."

"మరి?"

"వాల్లు మా పార్టీ కాదు"

అదిరిపడ్డాను నేను.

బసెక్కినానన్న మాటే గాని నన్నా షాక్ ఇంకా వదల్లేదు.

అంటరానితనం కన్నా హీనంగా తయారైన రాజకీయ మత్తు పల్లెల్ని దట్టమైన మేఘాలల్లే ఆక్రమించుకొన్న వైనం భయభ్రాంతుల్ని కల్గిస్తోంది.

ఉదయం కలిసికట్టుగా ఆందోళనచేసిన వీళ్ళే సాయంత్రానికంతా యిట్లా తయారయ్యారంటే నమ్మశక్యం కాకుండా ఉంది.

అప్పుడు నాకో అనుమానమొచ్చింది.

ఉదయం రెండు పార్టీలు కలిసి రాస్తారోకో చేసినట్టులేదు. ఉదయమొక గుంపు. సాయంత్రమొక గుంపుగా వంతులు వేసికున్నట్లుంది. పోటీగా ఆందోళన నిర్వహించినట్లుంది.

పార్టీల ప్రమేయం లేకుండా వీళ్ళంతా కలిసి సమస్యల సాధనకు ఉద్యమిస్తే ఎంత బావుంటుంది.

వీళ్ళందరికో నాయకుడు కావాలి. రాజకీయాలకు సంబంధంలేని నాయకుడు. నిస్వార్థపరుడైన వాడు.

ప్రభాకర్ గుర్తొచ్చాడు.

ఫలానా పార్టీకి చెందిన వాడినని చెప్పుకొనే ఆ ఒక్క బలహీనత లేకుంటే అతను సమర్థుడే. వీళ్ళను సక్రమ మార్గంలో పెట్టే సత్తా ఉన్నవాడే.

బంద్ రోజు వీళ్ళందర్నీ కలుపుకొంటే అతని ప్రయత్నానికి ఎంతయినా ఉత్తేజమొస్తుంది.

బస్సు దిగగానే ప్రభాకర్ కోసం వెదికాను.

మిత్రుల్ని వెంటేసుకొని ఓ గుడ్డల షాపువద్ద దొరికాడు.

నన్ను చూసి దగ్గరగా వచ్చాడు.

"డేట్ ఫిక్స్ చేశారా?" అడిగాను.

"లేదు."

"ఏం?"

"ఆ రోజు రాష్ట్ర నాయకుల్ని పిలిపిద్దామనుకొంటున్నాను. ఫండ్స్ కావాలి. వాటికోసం తిరుగుతున్నాం" చెప్పాడు.

ఈ రాజకీయాలు మానుకొమ్మని అతనికి చెప్పాలనుకొంటున్నాను. స్వచ్ఛంద సేవకునిగా, ప్రజల మనిషిగా మారమని సలహా ఇద్దామనుకొంటున్నా.

అంతలో అతనన్నాడు "చాలా ఇబ్బంది వచ్చిపడేటట్టుంది సార్!" అని

ప్రశ్నార్థకంగా అతనికేసి చూశాను.

"మేము ఫండ్స్ వసూలు చేయబోయే లోపల వానొచ్చేటట్టుంది."

"వస్తే?"

"కరువున్నప్పుడయితేనే గదా మా 'బంద్'కు విలువ".

"అయితే...?"

"దేవుని దయవల్ల ఇంకో వారం రోజులు వాన రాకుంటే మేము దిగ్విజయంగా ప్రజా సమస్యల్ని ప్రభుత్వానికి తెలియజేస్తాం."

నాకు తల తిరిగిపోయింది.

ఎలా అక్కణ్ణించి తప్పుకొన్నానో నాకే అర్థం కాలేదు.

అభివృద్ధికి నోచుకోకుండా అన్ని రంగాలలో రాయలసీమ ఎందుకు వెనకబడివుందో నాకిప్పుడు బాగా అర్థమవుతోంది.

◆ *సాహిత్య నేత్రం, జనవరి - మార్చి, 1996* ◆